సాక్షి సిద్దిపేట

సోమవారం ¦ 14 ¦ అక్టోబర్ ¦ 2024

న్యూస్‌రీల్

రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు



రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

వర్గల్(గజ్వేల్): విద్యాసరస్వతి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు శనివారం విజయ దశమి వేడుకలతో ముగిశాయి. పండుగ పర్వదిన వేళ జగన్మాత రాజరాజేశ్వరిదేవిగా సరస్వతి అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారికి విశేషాభిషేకం జరిపారు. సర్వాలంకార శోభితులైన అమ్మవారు జగజ్జనని రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. శమీపూజ అనంతరం ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు అమ్మవారి విజయదర్శనం లభించింది. శ్రవణ నక్షత్రం సందర్భంగా వెంకటేశ్వరునికి లక్ష తులసి దళార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన త్రిరాత్రోత్సవాలు



అమ్మవారికి త్రిశూల స్నానం చేయిస్తున్న ఆలయ పూజారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన దేవి త్రిరాత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి శోభాయాత్ర నిర్వహించి స్వామి పుష్కరిణి (ధర్మగుండం)లో త్రిశూల స్నానం చేయించి పరిసమాప్తి గావించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, స్థానాచారి మల్లయ్య, రవి, భాస్కర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రాకతో సందడిగా మారింది. ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. ఉదయం క్షేత్రానికి చేరకున్న భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పట్నాలు, ఓడిబియ్యం, అభిషేకం, కల్యాణం మొదలైన ప్రత్యేక పూజలునిర్వహించారు.

రుణాలు రీ షెడ్యూల్ చేయండి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాములు



మాట్లాడుతున్న రాములు

సిద్దిపేటఅర్బన్: రుణామాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలు అందించడంలో తీవ్ర జాప్యం అవుతోందని, వెంటనే రైతులందరికి రుణాలు రీ షెడ్యూలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో కాముని గోపాలస్వామి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రూ.2లక్షల రుణామాఫీ చేయడంతో పాటు వెంటనే రుణాలు రెన్యువల్ చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికి త్వరగా రుణాలు అందించాలన్నారు. రూ. 2 లక్షల పైన రుణం ఉన్న వారికి సైతం రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికి రైతు భరోసా పేరిట ఎకరానికి రూ. 15 వేలు చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రైతు భరోసా నిధులను సైతం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, వెంకట్, రవికుమార్, శ్రీనివాస్, శారద, నవీన, శిరీష, రవీందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా దసరా

ఘనంగా విజయ దశమి వేడుకలు

- హుస్నాబాద్, సిద్దిపేటలలో రావణుడి ప్రతిమల దహనం
- మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరు
- భారీగా తరలివచ్చిన ప్రజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హాజరైన జనం



హుస్నాబాద్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విజయదశమి సందర్భంగా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు కట్టపై మిత్ర మండలి 87 ఆధ్వర్యంలో శనివారం రామ్ లీలా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. రావణుడి ప్రతిమను దహనం చేశారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు సైతం హాజరయ్యారు. తొలుత కళాకారుల ఆటాపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెడుపై విజయం సాధించినందుకు గాను దసరా జరుపుకొంటామన్నారు. 2 దశాబ్దాలుగా హుస్నాబాద్‌లో ఆగిపోయిన ఈ కార్యక్రమం, తాను ఎమ్మెల్యేగా అయిన తర్వాత చేయాలనుకున్నానన్నారు. రాబోయే కాలంలో ప్రతీ సంవత్సరం ఈ కార్యక్రమం మరింత ఘనంగా జరగనుందన్నారు.



హుస్నాబాద్: మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ప్రశాంత్‌నగర్.. దసరా ఉత్సవాలలో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నర్సాపూర్, రంగాధంపల్లి, రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రావణ ప్రతిమ దహన కార్యక్రమం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ముందుగా హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పాలపిట్టను వదిలి, రావణాసుర ప్రతిమల దహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధి వేగంగా జరగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. విజయ దశమి అంటే చెడుపై మంచి విజయం సాధించడమే అన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంగథాంపల్లిలో రావణుడి ప్రతిమ దహనం చేసిన హరీశ్‌రావు

సిద్దిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు.

కులగణన పూర్తి కాగానే 'స్థానిక'ం

హుస్నాబాద్: రాహుల్ గాంధీ దేశ ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం శాసనసభలో కులగణన చేస్తామని తీర్మానం చేశామని, ఈ తంతు పూర్తి కాగానే స్థానిక సంస్థల ఎన్నికలు దామాషా ప్రకారం నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జమ్మి పూజ, వాహన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ప్రభాకర్ మాట్లాడారు. ప్రభుత్వం ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి సర్వే చేయడానికి జీఓ 18 విడుదల చేసిందన్నారు. ఈ సర్వే 60 రోజుల పాటు సర్వే నిర్వహించనుందని తెలిపారు. వైద్యపరంగా నియోజకవర్గానికి త్వరలోనే గుడ్ న్యూస్ రాబోతోందని తెలిపారు. వచ్చే వర్షాకాలం లోపు గౌరవెల్లి కాలువల నిర్మాణాలు పూర్తి చేసి సాగునీటిని అందిస్తామన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రావణుడి ప్రతిమ దహనం

లాజిస్టిక్ హబ్‌గా గజ్వేల్

- మనోహరాబాద్ మండలంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు
- భూసేకరణలో అధికారులు నిమగ్నం
- త్వరలో టీఎస్‌ఐఐసీకి భూముల అప్పగింత

గజ్వేల్: నియోజకవర్గం ఇక 'లాజిస్టిక్ హబ్'గా మారనుంది. ఇప్పటికే వివిధ రంగాల్లో అభివృద్ధికి నమూనాగా నిలిచిన ఈ ప్రాంతం సరుకు రవాణా సేవల్లోనూ తనకుంటూ ప్రత్యేకతను చాటుకోనుంది. నియోజకవర్గంలోని మనోహరాబాద్ మండలం పరికిపండ శివారులో లాజిస్టిక్ పార్కు నిర్మాణం కోసం సుమారుగా 350 ఎకరాల భూమిని సేకరించే ప్రక్రియ వేగంగా సాగుతోంది. త్వరలోనే టీఎస్ఐఐసీ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్)కు ఈ భూములను అప్పగించి పనుల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. లాజిస్టిక్ పార్కు పూర్తయితే గజ్వేల్ ప్రాంతమే కాదు... ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ ప్రయోజనం కలగనుంది. ఈ వ్యవహారంపై కథనం....

భూసేకరణ సమస్యలతో రెండేళ్లుగా పెండింగ్‌లో పడిన మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు(బహుళ విధ సరుకు రవాణా సేవల సముదాయం) ఏర్పాటుకు ముందడుగు పడింది. కేంద్రం రెండేళ్ల క్రితమే తెలంగాణ సహా మరో 16 రాష్ట్రాలకు లాజిస్టిక్ పార్కులు మంజూరు కూడా చేసింది. కానీ ఈ ప్రాజెక్ట్‌కు వందల ఎకరాల్లో భూమి అవసరముంటుంది. వేల కోట్ల పెట్టుబడుల సమీకరణే లక్ష్యంగా ఈ పార్కు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రత్యక్షంగా లక్ష, పరోక్షంగా మరో రెండు లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేయనున్నారు.

భూసేకరణ, ఇతర వనరుల సమస్యను అధిగమించి..

గజ్వేల్ నియోజకవర్గంలోని మనోహరాబాద్ మండలం పరికిబండ శివారు ప్రాంతం అనుకూలంగా ఉందని గుర్తించారు. ఈప్రాంత శివారులో 350 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా... ఇప్పటికే కొంత భూమిని అధికారులు సేకరించారు. ఆరు వరుసల జాతీయ రహదారికి, విమానాశ్రయానికి సమీపంలో ఉండటమే కాకుండా, రైల్వేలైన్‌తో అనుసంధామై ఉండాలనే అంశానికి కూడా ఈ ప్రాంతం అనుకూలమైందిగా మారింది. లాజిస్టిక్ పార్కు ఏర్పాటైతే ఈ ప్రాంతానికి 44వ నంబర్ ఆరు వరుసల జాతీయ రహదారిని ఆనుకొని ఉండటం, ట్రిపుల్ ఆర్‌కు సమీపంలో ఉండటం, హైదరాబాద్, కొత్తపల్లి రైల్వేలైన్‌లు అనుసంధానమై ఉండటం, విమానాశ్రయం కూడా 100 కిలోమీటర్ల చేరువలో ఉండటం వల్ల ఈ ప్రదేశానికి అన్ని రకాలు అనుకూలతలు ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే మార్గంపై ఉన్న గజ్వేల్ రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే హబ్‌గా మార్చడానికి నిర్ణయించింది. ఇప్పటికే గజ్వేల్‌లో ప్రతిష్టాత్మక రేక్ పాయింట్‌ను కూడా ఏర్పాటు చేసి గూడ్స్ రైలు సేవలు కూడా ప్రారంభించారు. తద్వారా లాజిస్టిక్ హబ్‌గా మారటానికి మార్గం సుగమమైంది.



పరికిబండ శివారులో లాజిస్టిక్ పార్కు ఏర్పాటు కోసం సేకరించిన భూమి ఇదే

ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ ప్రయోజనం

లాజిస్టిక్ పార్కు ఏర్పాటుతో ఉమ్మడి మెదక్ జిల్లా (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి)కు భారీ ప్రయోజనం కలగనుంది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న ఈ జిల్లా వస్తు రవాణా రంగంలో హబ్‌గా మారితే...దీనికి అనుబంధంగా మరెన్నో పరిశ్రమలకు ఏర్పాటుకు అడుగులు పడనున్నాయి. ప్రత్యేకించి రవాణా, వాహన రంగం భారీ అభివృద్ధి చెందనుంది. మరోవైపు వస్తు నిల్వల కోసం భారీ గోదాముల నిర్మాణం కూడా జరగనుంది.

ఇది రాజ్యం చేసిన హత్యే

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆరోపణ

గజ్వేల్‌రూరల్: ఇటీవల ఆస్పత్రిలో చేరి చికిత్సపొందుతూ ప్రొఫెసర్ సాయిబాబా అనారోగ్యంతో మరణించారని, అయితే చేయని నేరానికి ఆయన తొమ్మిదేళ్ల జైలుపాలయ్యారని ఇది రాజ్యం చేసిన హత్యేనని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా, జర్నలిస్టు కొల్పుల శ్రీనివాస్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దళిత, ఆదివాసి, పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన పాపానికి తొమ్మిదేళ్లపాటు జైలులో నిర్బంధించారని గుర్తుచేశారు. తెలుగు గడ్డపై కడు పేదరికంలో పుట్టి ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి వేలాది మందికి బోధించిన ఆయనపై కుట్రలు పన్ని జైలుపాలు చేశారని ఆరోపించారు. తీరా నిరాధారమైన కేసు అంటూ సుప్రీం కోర్టు కొట్టేసిందన్నారు. ఇప్పుడు ఆయన మరణానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

సరస్వతీ పుత్రికలకు బాసట

- 'డాక్టర్.. డాటర్స్' కథనానికి స్పందన
- పలువురు రూ.1.10 లక్షల సాయం

సాక్షి ఎఫెక్ట్..

సిద్దిపేటకమాన్, చిన్నకోడూరు(సిద్దిపేట): సాక్షిలో డాక్టర్ డాటర్స్ అనే కథనానికి స్పందించి చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌కు చెందిన చంద్రారెడ్డి, వేర్వేగా పలువురు ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 12న ఈ కథనం ప్రచురితమైంది. అందులో ఫోన్ నంబర్ తీసుకొని వైద్యుల తండ్రి కొంక రామచంద్రం (శేఖర్)తో మాట్లాడి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని చంద్రారెడ్డి రూ.50 వేలు, వివిధ ప్రాంతాల నుంచి పలువురు రూ.60 వేలను అందజేశారు. సిద్దిపేట పట్టణం నర్సాపూర్‌కు చెందిన కొంక రామచంద్రం (శేఖర్), శారద దంపతులకు నలుగురు కుమార్తెలు. భార్యాభర్తలు టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి నలుగురు కుమార్తెలు ఉండగా పెద్ద కూతురు మమత ఎంబీబీఎస్ పూర్తి చేసింది. రెండో కూతురు ఎంబీబీఎస్ ఫైనలియర్, మరో ఇద్దరు కూతుళ్లు ఈ ఏడాది మెడిసిన్‌లో సీట్లు సాధించారు. ఈ విషయాన్ని తెలుసుకొని కలెక్టర్ మను చౌదరి ఆరా తీసినట్లు తెలిసింది. అలాగే రామచంద్రం ఫోన్ నంబర్ కూడా తెలుసుకున్నట్లు సమాచారం. నేడు లేదా రేపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆయన మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కాగా, రామచంద్రం సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్థిక సాయం అందజేస్తున్న చంద్రారెడ్డి

టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



దుద్దెడ శివారులో టోల్ ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

- 3 కిలో మీటర్ల వరకు బారులు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం దుద్దెడ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల రద్దీ పెరిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో సొంతూర్లకు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాలు క్యూ కట్టాయి. పండుగల నేపథ్యంలో కౌంటర్ల సంఖ్య తాత్కాలికంగా పెంచినప్పటికీ రద్దీని అరికట్టలేకపోయారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 40 వేల వాహనాలు టోల్ ప్లాజా నుంచి వెళ్లినట్లు సమాచారం. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రాకపోకల దృష్ట్యా రెండు వైపుల మరో రెండు లైన్ల కౌంటర్లను పెంచేలా చూడాలని ప్రయాణికులు కోరారు.

దసరాకు కిక్కే.. కిక్కు

కొల్చారం(నర్సాపూర్): దసరాకు మద్యం ఏరులై పారింది. పండుగకు మూడు రోజుల ముందు రూ. 98.44 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనాపూర్ శివారులోని మద్యం ఆధారిత నిల్వ కేంద్రం (ఐఎంఎల్ డిపో) పరిధిలో 118 మద్యం దుకాణాలు, 15 బార్లు ఉన్నాయి. మద్యం డిపో నుంచి పండుగకు ముందు 9, 10, 11 తేదీల్లో ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) 1,07,434 కేసులు, బీరు 1,53,609 కేసులు డిపో పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లకు చేరినట్లు డిపో వర్గాలు తెలిపాయి.



కొట్టొచ్చిన నిర్లక్ష్యం..!

- బావిలో నిల్వ నీటిని తాగునీటి కోసం సరఫరా
- అధికారులు, సిబ్బంది అలసత్వంతో ప్రాణాలు పోయిన వైనం
- రాష్ట్ర విపత్తు నియంత్రణ ల్యాబ్‌కు నీటి నమూనాలు
- సంజీవరావుపేటలో ఘటన..

సాక్షిప్రతినిధి,సంగారెడ్డి/నారాయణఖేడ్: కలుషిత తాగునీరు సేవించి ఇద్దరు మృతికి కారణమైన ఘటనలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బావిలో కొన్ని రోజులుగా నిల్వ నీటిని తాగునీటి అవసరాలకు సరఫరా చేయడంతో ఈ దారుణం చోటు చేసుకుందని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేటలోని బీసీ కాలనీలో కలుషిత తాగునీరు సేవించి ఇద్దరు మృతి చెందడంతో పాటు, పదుల సంఖ్యలో గ్రామస్తులు వాంతులు విరేచనాల బారిన పడ్డారు. వారిని సంగారెడ్డి, నారాయణఖేడ్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అధికారులు, సిబ్బంది బావిలో నిల్వ ఉన్న నీటితో ట్యాంకు నింపి ఆ నీటిని తాగేందుకు సరఫరా చేసినట్లు ఉన్నతాధికారుల పరిశీలనలో తేలింది.

వారం క్రితం చెడిపోయిన మోటారు

ఈ గ్రామానికి బోరంచ వాటర్ గ్రిడ్ నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. అయితే ఈ ప్రాంతానికి సరఫరా చేసే పైప్‌లైన్‌కు సంబంధించిన మోటారు వారం రోజుల క్రితం చెడిపోయింది. వెంటనే దీనికి మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిన అధికారులు.. బావిలో నిల్వ ఉన్న నీటిని ట్యాంకులోకి పంపి సరఫరా చేశారు. చాలా రోజులుగా నిల్వ ఉన్న నీరు కావడంతో బ్యాక్టీరియా పెరిగింది. ఈ నీటిని సేవించిన వారిలో ఇద్దరు మృత్యువాత పడగా, మిగిలిన వారు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

స్థానిక ల్యాబ్‌లో నార్మల్ రిపోర్టు..

ఇద్దరు మృతి, పలువురు ఆస్పత్రి పాలు కావడానికి కారణమైన కలుషిత తాగునీటి నమూనాలను అధికారులు సేకరించారు. హైదరాబాద్ రాష్ట్ర విపత్తు నియంత్రణ విభాగానికి చెందిన అధికారులు గ్రామానికి వచ్చి నీటి నమూనాలు సేకరించారు. అక్కడి ల్యాబ్‌లో ఈ నీటిని పరీక్షించనున్నారు. అలాగే మిషన్ భగీరథ ల్యాబ్‌లోనూ ఈ నీటి పరీక్షలు నిర్వహించారు. నారాయణఖేడ్‌లోని ల్యాబ్‌లో హెచ్ 2 ఎస్ పరీక్ష చేశారు. కెమికల్, బ్యాక్టీరియా టెస్ట్ నిర్వహించగా ఈ రెండు రిపోర్టులు నార్మల్‌గానే వచ్చాయని ల్యాబ్ ఇన్‌చార్జి, ఏఈ శ్రీకాంత్ తెలిపారు. కాగా ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునే అంశాన్ని జిల్లా పంచాయతీ అధికారులు పరిశీలిస్తున్నారు.



కాలనీకి తాగునీరు సరఫరా చేస్తున్న బావి ఇదే..

కొనసాగుతున్న వైద్య శిబిరం

ఎమ్మెల్యే, ఆర్డీఓ ఆదేశాల మేరకు గ్రామంలోని పల్లె దవాఖానాలో నిజాంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రాజేశ్వర్, సుశీల్ కుమార్, శృతితో పాటు నలుగురు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశా కార్యకర్తలు, ఒక హెల్త్ సూపర్‌వైజర్ వైద్య సేవలు అందిస్తున్నారు. శనివారం 70 మందిని పరీక్షించి అవసరం ఉన్నవారికి చికిత్స, మందులు అందజేశారు. ఆదివారం తొమ్మిది మంది శిబిరంలో చేరగా వారిలో నలుగురిని ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి రిఫర్ చేశారు. శనివారం రిఫర్ చేసిన వారిలో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదుగురు, అక్కడి ప్రైవేట్ ఆస్పత్రిలో ఒకరు, ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో 11 మంది, ప్రైవేట్‌లో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. అయితే గ్రామానికి చెందిన బోడ మహేష్ (23), బాయికాడి సాయమ్మ (86) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి మృతికి కలుషిత నీరే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. సోమవారం గ్రామాన్ని డీపీఓ సాయిబాబాతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ అధికారులు సందర్శించి తగు సహాయక చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని వైద్యులు చెబుతున్నారు. ఖేడ్ ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి బాధితులను పరామర్శించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


ఎద్దు కళేబరం వద్ద బాధిత రైతు తదితరులు

నవాబుపేట: విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి వెల్లకుండా గ్రామానికి రామచంద్రయ్య.. ఎప్పటి లాగానే తన రెండు ఎడ్లను ఆదివారం మేతకు వదిలారు. ఈ క్రమంలో అవి మేత మేసుకుంటూ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఓ ఎద్దు తగిలింది. దీంతో కరెంట్ షాక్‌కు గురై అది అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో బాధిత రైతు బోరున విలపించాడు. ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, జీవనాధారం కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

హకీంపూర్‌లో..

దుద్యాల్: విద్యుదాఘాతంతో ఓ పాడి పశువు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధి హకీంపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దగనపురం రమేశ్‌కు చెందిన పాడి పశువు పొలంలో మేత మేస్తోంది. ఈ క్రమంలో అది మేతమేస్తూ.. పక్కన పొలంలోని ట్రాన్స్‌ఫార్మ ఎర్తు వైరు తగలడంతో కరెంట్‌షాక్‌కు గురై పశువు అక్కడికక్కడే మృతి చెందింది. పశువు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు విలపించాడు. జీవనాధారం కోల్పోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

మొదటి ప్రయత్నంలోనే..


అక్షిత

మర్పల్లి: ఓ విద్యార్థిని తొలి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటు సాధించింది. మండల కేంద్రానికి చెందిన పబ్బే చంద్రకళ, దివాకర్ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నాడు. చిన్న కుమార్తె అక్షిత ప్రాథమిక విద్యాభ్యాసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ప్రాథమికోన్నత హిమాయత్‌నగర్, ఇంటర్ శ్రీచైతన్య కళాశాలలో పూర్తిచేసింది. ఈ క్రమంలో నీట్ (ఎంబీబీఎస్)ప్రవేశ పరీక్షలో 720 మార్కులకు 520 మార్కులతో 185853 ర్యాంకు సాధించారు. దీంతో రెండో కౌన్సెలింగ్‌లో సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు తండ్రి తెలిపారు. తల్లి స్టాఫ్‌నర్సుగా, తండ్రి వ్యవసాయం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

పెద్దేముల్: పండుగ పూట ఓ రైతు ఇంట్లో విషాదం నెలకొంది. ఈ సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దకుర్వ బాలప్ప(45), అడవి పందుల బెడదతో తన మొక్కజొన్న పంట కాపాలాకు వెళ్లాడు. రోడ్డు పక్కనే పొలం ఉండటంతో రోడ్డుకు పక్కనే నిద్రించాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కనే వ్యక్తి పడుకున్నది గమనించని గుర్తు తెలియని వాహన దారుడు.. సదరు రైతును ఢీకొట్టడంతో బాలప్ప తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలప్ప మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. ఆస్పత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

- ఒకరి మృతి

బొంరాస్‌పేట: ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి జాతీయ రహదారి 163పై మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. చింతలదిండికి చెందిన ఎరుకలి మొగులయ్య(34) తన బైక్‌పై హైదరాబాద్ నుంచి సొంతూరుకు వెళ్తుండగా.. కొడంగల్ నుంచి పరిగి వెళ్తున్న ఫార్చునర్ కారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహన దారుడు మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఢీకొట్టిన కారు శంకర్‌పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడికి చెందినదిగా అనుమానిస్తున్నారు.

తీపి తగ్గింది..!

చెరకు పంట సాగుపై తగ్గిన ఆసక్తి

- పడిపోయిన పంట విస్తీర్ణం
- గత సంవత్సరం ట్రైడెంట్‌లో జరగని క్రషింగ్
- నష్టాల వల్ల ఇతర పంటల సాగు


జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న చెరకు పంట

జహీరాబాద్ టౌన్: ప్రతికూల పరిస్థితుల కారణంగా జహీరాబాద్ ప్రాంత రైతులకు చెరకు పంట సాగు పట్ల ఆసక్తి తగ్గింది. విత్తనం నాటి నుంచి కర్మాగారానికి సరఫరా వరకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. దిగుబడి రాక.. గిట్టుబాటు ధర లేక.. పెట్టుబడులు రాని దయనీయ పరిస్థితులు ఉన్నాయి. సాధారణంగా ఎకరానికి 40 టన్నుల వరకు దిగుబడి రావాలి. కానీ ప్రస్తుతం 25 టన్నులు దాటడంలేదు. రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంటను కర్మాగారానికి చెరకు పంట సరఫరా చేసినా బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ట్రైడెంట్ చక్కెర కర్మాగారం గత సంవత్సరం క్రషింగ్ జరగలేదు. తక్కువ ధరకు దళారులకు అమ్మడం వల్ల భారీ నష్టాలు చూశారు. అందుకని ఈ సంవత్సరం చెరకు పంటను తక్కువ విస్తీర్ణంలో వేశారు. ప్రత్యామ్నాయంగా ఇతర పంటలపై శ్రద్ధ చూపారు. దీంతో ఈ ఏడాది చెరకు పంట విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.

జహీరాబాద్ ప్రాంత నేలలు చెరకు, అల్లం, ఆలుతో పాటు కంది, సోయాబిన్, పత్తి, పెసర, మొక్కజొన్న, శనగ పంటలకు అనుకూలం, శాశ్వత నీటి వనరులు లేక బోరు బావులపై ఆధారపడి రైతులు ఈ పంటలను పండిస్తున్నారు. మిగతా పంటలతో చూస్తే చెరకు పంట సాగులో పెద్దగా నష్టం రాదని ఎక్కువ మంది రైతులు పంట వేస్తున్నారు. ఎకరం పొలం ఉన్న రైతు కూడా చెరకు పండిస్తుంటారు. అందుకని జహీరాబాద్ ప్రాంతంలో ప్రతి సంవత్సరం సుమారు 4 లక్షల టన్నుల వరకు చెరకు పంట సాగవుతుంది.

రెండు సంవత్సరాల నుంచి రైతులు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారు. పట్టణ సమీపంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం ఉండగా రెండు మూడు సంవత్సరాల నుంచి పలు కారణాల వల్ల క్రషింగ్ సరిగ్గా జరగడంలేదు. రెండేళ్ల క్రితం సరఫరా చేసిన పంటకు బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగింది. పైగా గత సంవత్సరం కర్మాగారంలో క్రషింగ్ ఆడలేదు. గత్యంతరం లేక రైతులు తక్కువ ధరకు బ్రోకర్లకు పంటను అమ్ముకున్నారు. పలు కారణాల వల్ల ఈ ఏడాది పంట సాగు పట్ల రైతులు ఆసక్తి అంతగా చూపలేదు. ఉన్న పొలంలో చెరకుతో పాటు ఇతర పంటలను వేశారు. సాధారణంగా జహీరాబాద్ ప్రాంతంలో ప్రతి సంవత్సరం సుమారు 25 వేల ఎకరాల్లో సుమారు నాలుగు లక్షల టన్నుల చెరకును రైతులు చెరకు పండిస్తుంటారు. ప్రతికూల పరిస్థితుల వల్ల ఈ సంవత్సరం చెరకు పంట విస్తీర్ణం 10 వేల ఎకరాలకు పడిపోయింది. సుమారు 3 లక్షల టన్నుల చెరకు పండడం కష్టమే.

గోదావరి గంగపై ఆశలు

జహీరాబాద్ సమీపంలో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో గత సంవత్సరం క్రషింగ్ ఆడలేదు. ఈ సంవత్సరం జరుగుతుందో లేదో అన్న అనుమానం ఉంది. అయితే రాయికోడ్ మండలంలో కొత్తగా గోదావరిగంగ చెక్కర కర్మాగారం ఏర్పాటవుతుంది.

> **చెరకు పంట తగ్గించా..**
>
> 
>
> నాకున్న ఐదు ఎకరాల్లో చెరకు పండించే వాడిని. రెండు మూడు సంవత్సరాల నుంచి చెరకు పంట వల్ల లాభాలు రావడంలేదు. సంవత్సరం పొడుగు కష్టపడి పండించి పంటను తక్కువ ధరకు అమ్ముకోవల్సి వస్తుంది. ట్రైడెంట్‌లో క్రషింగ్ కూడా జరగనందున టన్నుకు రూ.1,500 చొప్పున దళారాలకు ఇవ్వాల్సి వస్తుంది. అందుకని ఈ సంవత్సరం ఎకరం పొలంలో చెరకు పంట వేసి మిగతా నాలుగు ఎకరాల్లో కంది, మినుము, పెసర, సోయాలు వేశా.
>
> – శంకర్, రైతు, మన్నాపూర్

ఈ సంవత్సరం కర్మాగారంలో క్రషింగ్ చేస్తామని యాజమాన్యం చెబుతోంది. రైతులు చెరకు పంట సాగు చేయాలని కోరుతూ ప్రస్తుతం ఉన్న పంటకు అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. గోదావరిగంగలో క్రషింగ్ జరిగితే కష్టాలు తొలగిపోతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పండుగ పూట విషాదం

- విద్యుత్ వైరు తగిలి బాలుడు మృతి
- దుర్గామాత ఊరేగింపులో ఘటన


శిక కీర్తన్య(ఫైల్)

అక్కన్నపేట (హుస్నాబాద్): దుర్గామాత నిమజ్జనం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. అమ్మవారు ఊరేగింపు కోసం ఏర్పాటు చేసిన డీజేకు సరఫరా అయ్యే కరెంట్ తీగ చిన్నారిని బలి తీసుకుంది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శిక మౌనిక–తిరుపతి దంపతులకు ఒక కుమారుడు శిక కీర్తన్య(8), కూతురు ఉన్నారు. శనివారం రాత్రి గ్రామంలో దుర్గామాత నిమజ్జనం ఊరేగింపులో డీజేకు సమకూర్చిన కరెంట్ తీగ వైరు తెగి చిన్నారి కాలికి తాకి షాక్ తగిలింది. గమనించిన స్థానికులు హుటాహుటిన సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. కానీ పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, పండుగ పూట చిన్నారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు.

స్టేటస్ పెట్టి .. ఉసురుతీసుకున్నాడు


ఫణివర్మ

పటాన్‌చెరు టౌన్: తాను చనిపోతానని వాట్సాప్ స్టేటస్ పెట్టి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన నాగమణి కుటుంబం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రామమందిర్ రోడ్డులో ఉంటున్నారు. వీరి కుమారుడు ఫణివర్మ(29) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఫణివర్మ వారి బంధువుల అమ్మాయిని ప్రేమించడంతో ఇరువురి కుటుంబ సభ్యులు మాట్లాడుకొని సంవత్సరం తర్వాత వివాహం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో 12న ఫణివర్మ తల్లి నాగమణి డ్యూటీకి వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న ఫణివర్మ.. "నేను చనిపోతున్నాను"అని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. ఇది చూసిన కుటుంబ సభ్యులు వెంటనే ఇంటికి వచ్చి చూడగా గడియ పెట్టి ఉంది. కిటికి అద్దం పగులగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పెళ్లి కావడం లేదని బలవన్మరణం


అనిల్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): తనకు వివాహం కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన వీరబోయిన భాస్కర్ చిన్న కుమారుడు అనిల్(28)కు మూడు సంవత్సరాల క్రితం ఓ పరిశ్రమ వద్ద ప్రమాదంలో కిడ్నీ దెబ్బతింది. అప్పటి నుంచి తండ్రితో కలసి పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అతనికి పెళ్లి చూపులకు వస్తున్నా.. వివాహం కుదరడం లేదు. దీంతో తనకు పెళ్లి కావడం లేదని మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో సీలింగ్‌కు ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన తల్లి గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారొచ్చి మేడ్చల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అనిల్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పుల్కల్ (అందోల్): సింగూరు ప్రాజెక్టు దిగువ భాగంలో మూడు రోజుల క్రితం గల్లంతైన వ్యక్తి మృతదేహం లభించింది. మండల పరిధిలోని సింగూర్‌కు చెందిన సంఘం విఠల్ (35) శుక్రవారం డ్యామ్ దిగువ భాగంలో గేట్ల వద్ద స్నానానికి వెళ్లాడు. ఆ సమయంలో గేట్లు తెరిచి ఉండడంతో ప్రవాహ వేగంలో కొట్టుకుపోయాడు. నీటిలో కొట్టుకుపోవడాన్ని గమనించిన పర్యాటకులు డ్యామ్ అధికారులకు సమాచారం అందించారు. నది గట్టుపై గల్లంతైన వ్యక్తి బట్టలు వస్తువులు ఐడి కార్డు సాయంతో సింగూరు గ్రామస్తుడిగా గుర్తించారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో రెండు రోజుల నుంచి జాలరులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం మృతదేహం తేలడంతో వెలికి తీశారు. పుల్కల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి

మొయినాబాద్: మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని చందానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే బాబుజాన్ కుటుంబ సమస్యలతో తరచూ భార్య రిజ్వానతో గొడవ పడేవాడు. శనివారం రాత్రి బాబుజాన్ రోజుమాదిరిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఆయన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో వీపులో పొడిచి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న చుట్టు పక్కలవారు వచ్చి విడిపించి పోలీసులకు సమాచారం చేరవేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన రిజ్వానాను చికిత్సకోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిందితునిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిలుకూరు సన్నిధిలో మేఘాలయ గవర్నర్



మొయినాబాద్: మేఘాలయ గవర్నర్ విజయ్‌శంకర్ చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. శనివారం దసరా పండుగ రోజు చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకుడు రంగరాజన్ స్వాగతం పలికారు. గవర్నర్ ఆలయ గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయ విశిష్టతను అర్చకుడు రంగరాజన్ ఆయనకు వివరించారు. స్వామివారి వస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు.

అప్రమత్తతోనే గులాబీ పురుగుకు చెక్

- పత్తి పంటను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలే ముఖ్యం
- శాస్త్రవేత్త ఎన్.స్నేహలత సూచనలు



జహీరాబాద్: భారీ వర్షాల కారణంగా ఇప్పటికే పత్తి పంటలు దెబ్బతిన్నాయని, ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీడీఎస్–కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఎన్.స్నేహలత అన్నారు. గులాబీ పురుగు బారి నుంచి పత్తి పంటను కాపాడుకోవాలని సూచించారు. వర్షాల వల్ల ప్రత్యక్షంగా పంటలు దెబ్బతినగా, మిగిలిన పంటలకు పరోక్షంగా చీడపీడల బారిన పడి మరింత నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఈ సమయంలో గులాబీ పురుగు, రసం పీల్చే పురుగు, కాయకుళ్లు తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కాయ గట్టిపడి ఎదిగే దశలో ఉందన్నారు. కాయతొలుచు పురుగును తట్టుకునేందుకు బీటీ పత్తిని సాగు చేస్తున్నప్పటికీ గులాబీ రంగు పురుగు బీటీని కూడా తట్టుకుంటుందన్నారు.

> **నష్టపరిచే లక్షణాలు**
>
> గులాబీ పురుగు బారిన పడిన పంట పూత దశలో ఉన్నప్పుడు దాంట్లో విచ్చుకోకుండా ఉన్న పువ్వులను విప్పి చూస్తే పిల్ల పురుగు గమనించవచ్చన్నారు. వీటినే గుడ్డి పువ్వులు అంటారని పేర్కొన్నారు. పత్తి కాయలు పగలాల్సిన సమయం కంటే ముందుగానే పగిలి ఎండిపోతాయన్నారు.
>
> 
> పత్తి కాయకు గులాబీ పురుగు(ఫైల్)

యాజమాన్య పద్ధతులు

ముందుగా ఈ పురుగు కోశస్థ దశలు కోసి విడిచిపెట్టిన పంట లేదా భూమిలో కోశస్థ దశలు అలాగే ఉంటాయి. పంటను వేయడానికి ముందు ఏప్రిల్, మే నెలల్లో లోతు దుక్కులను దున్నడం వలన కోశస్థ దశలు సూర్య రశ్మికి ఆకర్షితం అవడం, పక్షుల నోటికి అందడం వలన కొంత వరకు ఈ పురుగు బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. పంట చుట్టు గాని, పంట లోపల గాని తుత్తురు బెండ లేదా బెండ లాంటి మొక్కలు ఉన్నట్లయితే తీసివేయాలన్నారు. పంటను వేసుకునే సమయంలో అంతర పంటగా ప్రతి ఏడు స్లాళ్లకు మధ్యన ఒక కంది సాలు వేసుకోవాలన్నారు. 45 రోజుల తర్వాత లింగాకర్షక బుట్టలు 4–8 అక్కడక్కడ అమర్చుకున్నట్లయితే పురుగు ఉధృతిని గమనించవచ్చన్నారు. పూత సమయంలో గుడ్డి పువ్వులు, వాటిలో పిల్ల పురుగులను గమనించినట్లయితే తీసి దూరంగా పారవేయాలని సూచించారు. 45 రోజులకు ముందుగా అజాడిరాక్టింగ్ 1500 పీపీఎం మందును 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకున్నట్లయితే ఈ పురుగు యొక్క గుడ్ల సంఖ్యను కొంత వరకు తగ్గించుకోవచ్చన్నారు. రెండో కాతకు మొదట్లోనే గులాబీ పురుగు యొక్క ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కనుక దీనికి క్లోరన్ట్రా నిలిప్రోల్ మరియు లేమ్డా సైహాలోత్రిన్‌ని కలిపి ఉన్న మందు 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకున్నట్లయితో ఉపయోగం ఉంటుందని సూచించారు.


సాగులో ఉన్న పత్తిపంట

బైక్ అదుపుతప్పి బీటెక్ విద్యార్థి మృతి


జశ్వంత్

పటాన్‌చెరు టౌన్: బైక్ అదుపు తప్పి కిందపడిన బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రామచంద్రాపురం ముంబై కాలనీకి చెందిన భెల్ కాంట్రాక్టు ఉద్యోగి భూపాల్ తన కుటుంబంతో కలిసి ఈనెల 12వ తేదీన దసరా పండుగకను పురస్కరించుకొని స్వగ్రామైన పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామానికి వెళ్లారు. అయితే బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అతని కుమారుడు జశ్వంత్(19) శనివారం సాయంత్రం బుల్లెట్ వాహనంపై నానమ్మ, పెదనాన్నలను కలిసి వస్తానని చెప్పి రామచంద్రాపురానికి వెళ్లాడు. అక్కడ నుంచి మేనల్లుడు రోషన్ బైక్ తీసుకొని చిన్నకంజర్ల వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు, కానీ అక్కడికి వెళ్లలేదు. అయితే మేనల్లుడు రోషన్, ముత్తంగి వద్ద టీ తాగేందుకు వస్తున్నామని, నీ బుల్లెట్ తీసుకొని, తన బైక్ ఇచ్చి వెళ్ల అని జశ్వంత్‌తో చెప్పాడు. కానీ జశ్వంత్ అక్కడికి వెళ్లకపోవడంతో మేనల్లుడు రోషన్ కొద్దిసేపు నిరీక్షించి ఇంటికి వెళ్లిపోయారు. తెల్లవారు జామున పోచారం గ్రామ శివారులో జశ్వంత్ బైక్‌పై నుంచి అదుపుతప్పి పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి భూపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వాహనాలు ఢీకొని.. ఏడుగురికి గాయాలు


రెండు వాహనాలు ఢీకొన్న దృశ్యం

నర్సాపూర్‌రూరల్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ లింగం తెలిపిన ప్రకారం.. సమీఉల్లా ఖాన్–రహమతున్నీసా దంపతులతో పాటు డ్రైవర్ అయూబ్‌ఖాన్ హైదరాబాద్ నుంచి వాహనంలో మెదక్ వెళ్తున్నారు. మరోవైపు సందీప్, సాయికుమార్ ఉదయ్, హరి, సిద్దు ఏడుపాయల నుంచి హైదరాబాద్ వెళుతున్నారు. రెడ్డిపల్లి సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేశాక.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

బావిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


బావిలో ట్రాక్టర్

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ ట్రాక్టర్ పాడుబడిన బావిలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలో చెత్త సేకరణ అనంతరం పాడుబడిన బావిలో చెత్తను డంపు చేసేందుకు రివర్స్ తీస్తున్న క్రమంలో అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ కిందికి దూకాడు.

వరాలు కురిపించేనా?

రేపు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

- నేవీ రాడార్ స్టేషన్ భూమిపూజలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- గెలిచాక మొదటిసారి కొడంగలేతర నియోజకవర్గంలో పర్యటన
- అభివృద్ధి పనులన్నీ సొంత నియోజకవర్గంలోనే..
- జిల్లా ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిడి
- జిల్లాకు సీఎం చేసిందేమీ లేదంటున్న ప్రతిపక్షాలు

వికారాబాద్: సీఎంగా బాధ్యతలు చేపట్టాక సొంత నియోజకవర్గ పర్యటనకే పరిమితమైన రేవంత్‌రెడ్డి మొదటి సారి కొడంగలేతర నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ నెల 15న పరిగి నియోజకవర్గం దామగుండం అటవీ ప్రాంతంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు. సీఎం సొంత నియోజకవర్గ అభివృద్ధి కోసం కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేసి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో జి ల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో కూడా అదే తరహా అభివృద్ధి చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితం చేశారని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. సీఎం జిల్లా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని మండిపడుతున్నారు.

కొడంగల్ తరహాలో..

వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలను కొడంగల్ తరహాలో అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి కొడంగల్‌కే పరిమితం కావడం జిల్లా ప్రజలను అసంతృప్తికి గురిచేస్తోంది. జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు టీ రామ్మోహన్ రెడ్డి, బీ మనోహర్‌రెడ్డి సైతం తమ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో సీఎంను ఒప్పించడంలో సఫలం కాలేకపోతున్నారనే వాదన వినిపిస్తోంది. కొడంగల్ అభివృద్ధికి రూ.5 వేల కోట్లు వెచ్చిస్తున్న ముఖ్యమంత్రి జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు కనీసం రూ.100 కోట్లు కూడా ఇవ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

పూడూరు: మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు పనులను ఆదివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నేవీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాడార్ స్టేషన్ ఏర్పాటైతే ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్డు, రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ప్రజలు ఆశిస్తున్న పనులివే..

జిల్లా అభివృద్ధిపై సీఎం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల మీదుగా హైవే అభివృద్ధి, మహబూబ్‌నగర్ నుంచి పరిగి నియోజకవర్గం గండేడ్, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల మీదుగా చించోలి వరకు మరో హైవే పనులు పూర్తి చేయటం, మన్నెగూడ నుంచి వికారాబాద్.. అనంతగిరి మీదుగా తాండూరు వరకు నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర రాజధానికి కనెక్టివిటీ కూడా పెరగనుంది. ఇదే సమయంలో షాద్‌నగర్ – పరిగి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయడంతో పాటు శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట మీదుగా మర్పల్లి వరకు రహదారి అభివృద్ధి చేయడం ద్వారా జిల్లా నలుమూలలకు నగరం నుంచి కనెక్టివిటీ పెరిగి అభివృద్ధికి మరింత ఊతమిచ్చేందుకు దోహదం చేయనుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. జిల్లా మీదుగా రీజనల్ రింగ్‌రోడ్డు కూడా వెళ్లనుండటంతో ఆ చుట్టు పక్కల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు లాంటి ప్రతిపాదనలు జిల్లా ప్రజలను ఊరిస్తున్నాయి. అనంతగిరిని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడం, మోమిన్‌పేటలో మొబిలిటి వ్యాలి, నవాబుపేట మండలం ఆర్కతల పరిసరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు లాంటి పనులకు ఇప్పటికే పునాదులు ప డ్డాయి. ఈ పనులన్నింటినీ పరుగులు పెట్టించటం ద్వారా జిల్లా రూపు రేఖలు మారుతాయని జిల్లా వాసులు ఆశిస్తున్నారు. వీటితో పాటు అస్తవ్యస్తంగా ఉన్న నాలుగు మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీల చుట్టూ రింగు రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.